హస్తగతం

- మంచిర్యాల చైర్మన్‌గా ఉప్పలయ్య, వైస్ చైర్మన్‌గా మహేష్
- నస్పూర్ చైర్మన్‌గా వేణు, వైస్‌చైర్‌పర్సన్‌గా రజితలు ఎన్నిక



మంచిర్యాల మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లను అభినందిస్తున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

ఏసీసీ/నస్పూర్, ఫిబ్రవరి 9: మంచిర్యాల, నస్పూర్ మున్సిపాలిటీలు హస్తగతమయ్యాయి. శుక్రవారం మంచిర్యాల మున్సిపల్ కార్యాలయంలో ఆర్డీవో వడాల రాములు, కమిషనర్ మారుతి ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మంచిర్యాల మున్సిపాలిటీలో 36 మంది కౌన్సిలర్లు ఉండగా 26 మంది కాంగ్రెస్ కౌన్సి లర్లు ఎన్నికకు హాజరయ్యారు. 10 మంది బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు గైర్హాజ రయ్యారు. ఎన్నిక నిర్వహించేందుకు అవసరమైన కోరం సభ్యుల సంఖ్య సరిపోయినందున ఎన్నిక ప్రక్రియ పూర్తి చేశారు.

చైర్మన్‌గా రావుల ఉప్పలయ్య పేరును కౌన్సిలర్ నల్ల శంకర్ ప్రతిపాదించగా మరో కౌన్సిలర్ మాజిద్ బలపర్చారు. అనంతరం వైస్‌చైర్మన్ సల్ల మహేష్ పేరును కౌన్సిలర్ వేములపల్లి సంజీవ్ ప్రతిపాదించగా మరో కౌన్సిలర్ రామగిరి బానేష్ బలపర్చారు. హాజరైన సభ్యులందరు చేతులెత్తి ఆమోదం తెలిపారు. చైర్మన్, వైస్ చైర్మన్‌లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆర్డీవో ప్రకటించి ప్రమాణ స్వీకారం చేయించారు. ఆర్డీవో, కమిషనర్‌లు వారిని అభినందించారు. చైర్మన్ చాంబర్‌లో ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. ఎమ్మెల్యే వారిని సన్మానించి అభినందించారు. చైర్మన్, వైస్ చైర్మన్లు ప్రజలకు అభివాదం చేస్తూ ర్యాలీగా ఎమ్మెల్యే నివాసానికి చేరుకున్నారు.

లోక్‌సభ ఎన్నికల అనంతరం బీఆర్‌ఎస్ కనుమరుగు

రానున్న లోక్‌సభ ఎన్నికల అనంతరం బీఆర్‌ఎస్ పార్టీ కనుమరుగవుతుందని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. ఆయన నివాసంలో మంచిర్యాల, నస్పూర్ మున్సిపాలిటీల చైర్మన్, వైస్‌చైర్మన్‌లను సన్మాన సభలో మాట్లాడారు. బీఆర్‌ఎస్‌కు ప్రజల్లో ఆదరణ తగ్గడంతో ఆ పార్టీ నేతలు సందిగ్ధంలో పడ్డారన్నారు. అధికారంలో ఉన్నప్పుడు అక్రమాలకు పాల్పడిన బీఆర్‌ఎస్ నేతలపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ధాన్యం తరుగు పేరుతో దోచుకున్న సొమ్ము ఎవరి ఖాతాలో పడిందో బీఆర్‌ఎస్ నేతలు జవాబు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీలో జరిగిన అక్రమాలను వెలికి తీస్తామన్నారు. ఇప్పటికే డీసీఎంఎస్ డీలర్‌షిప్‌లు తీసుకున్న వారు డబ్బులు వాపస్ తీసుకోవాలన్నారు. సింగరేణి ఉద్యోగి చనిపోయాడని ఫోర్జరీ పత్రాలతో ఉద్యోగం పొందిన యువతిపై విచారణ జరుగుతుందని, ఆమెకు సహకరించిన వారి గుట్టు త్వరలోనే బయటపెడతా మన్నారు. అన్ని వసతులతో పురపాలక సంఘానికి నూతన భవనం, ఐబీలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం కూలగొట్టి మాతా శిశు ఆసుపత్రి నిర్మాణం చేపడతామన్నారు. రాళ్లవాగుకు ఇరువైపులా కరకట్ట నిర్మాణానికి ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చిందని, నిధులు విడుదల కావాల్సి ఉంటుందన్నారు. మంచిర్యాలలో అదనంగా మరో రెండు రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. ఆసుపత్రుల్లో వైద్యం కోసం పార్టీలకతీతంగా ఆర్థిక సహాయం అందజేస్తున్నామన్నారు. సింగరేణి ఉద్యోగాల కోసం వయో పరిమితి రెండేండ్లు పెంచాలని సీఎంను కోరగా ఆమోదించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. మంచిర్యాల మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య, వైస్ చైర్మన్ సల్ల మహేష్, నస్పూర్ చైర్మన్ వేణు, పట్టణాధ్యక్షుడు తూముల నరేష్, బ్లాక్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, చిట్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

● నస్పూర్ మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికను జిల్లా పరిషత్ సీఈవో, ప్రత్యేకాధికారి నరేందర్ సమక్షంలో నిర్వహించారు. కాంగ్రెస్‌కు చెందిన 17 మంది సభ్యులు కాగా ఒకరు హాజరుకాలేదు. కాంగ్రెస్ సభ్యులు క్యాంపు నుంచి నేరుగా సమావేశానికి వచ్చారు. 16 మంది సభ్యులతోపాటు సీపీఐకి చెందిన ఇద్దరు, ఎక్స్‌అఫిషియో సభ్యుడు, ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావులు హాజరయ్యారు.

ముందుగా చైర్మన్ అభ్యర్థిగా సుర్మిళ్ళ వేణును బొద్దున సంధ్యారాణి ప్రతిపాదించగా సీపతి సు మతి బలపర్చారు. అనంతరం వైస్‌చైర్మన్ అభ్యర్థిగా గెల్లు రజితను బండారి సంధ్యారాణి ప్రతి పాదించగా తెనుగు లావణ్య బలపర్చారు. సభ్యులందరూ మద్దతు తెలుపడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రత్యేకాధికారి నరేందర్ ప్రకటించారు. చైర్మన్, వైస్ చైర్‌పర్సన్ చేత ప్రత్యేకాధికారి ప్రమాణ స్వీకారం చేయించారు. సీఐ ఆకుల అశోక్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. చైర్మన్, వైస్‌చైర్మన్లను నాయకులు, కార్యకర్తలు సంబరాలు నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి సీసీసీ కార్నర్ వరకు ఊరేగింపు చేసి బాణాసంచా కాల్చి సంబరాలు నిర్వహించారు.

అభివృద్ధికి పెద్దపీట: ఎమ్మెల్యే ప్రేంసాగర్ రావు

నస్పూర్ మున్సిపాలిటీలో గడిచిన నాలుగేళ్లలో బీఆర్‌ఎస్ చేయలేని అభివృద్ధి పనులను తాము ఏడాది కాలంలో చేసి చూపిస్తామని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికైన సందర్భంగా వారిని సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రధానంగా పట్టణంలో నెలకొన్న మంచినీటి సమస్యను పూర్తి స్థాయిలో పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. రోడ్లు, మురుగు కాలువల నిర్మాణ పనులు అవుతున్నాయన్నారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ వస్తే కొంత వరకు పనులు ఆగుతాయని, ఎన్నికల తర్వాత పనులు వేగవంతం అవుతాయన్నారు. అన్ని వార్డులకు సమానంగా అభివృద్ధి జరుగుతుందన్నారు.



చేతులెత్తి ఆమోదం తెలుపుతున్న మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు

అందరికి అందుబాటులో ఉంటా...
:చైర్మన్ సుర్మిళ్ళ వేణు



చైర్మన్ సుర్మిళ్ళ వేణు



వైస్ చైర్మన్ గెల్లు రజిత

అభివృద్ధికి శాయశక్తుల కృషి చేస్తానని, ప్రజల సమస్యలను పరిష్కరించడానికి పాటు పడుతానని చైర్మన్ సుర్మిళ్ళ వేణు అన్నారు. తనకు అవకాశం రావడానికి కృషి చేసిన ఎమ్మెల్యే ప్రేం సాగర్‌రావు, కౌన్సిలర్లకు ఆయన కృతజ్ఞతలు చెప్పారు. ప్రజలకు అందుబాటులో ఉంటానని ఎప్పటికప్పుడు సమస్యలపై దృష్టి సారిస్తానని చెప్పారు.



నస్పూర్‌లో హాజరైన మున్సిపల్ కౌన్సిలర్లు, ఎక్స్‌అఫిషియో సభ్యుడు, ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

రైతులు నీటి వనరులను సద్వినియోగం చేసుకోవాలి

హాజీపూర్, ఫిబ్రవరి 9 :రైతులు నీటి వనరులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి కల్పన అన్నారు. శుక్రవారం గుడిపేటలోని రైతు వేదికలో క్యాచ్ ద రెయిన్ క్యాంపెయిన్ (వాన నీటిని ఒడిసి పట్టడం)లో భాగంగా నేషనల్ వాటర్ మిషన్, నీరు, భూమి యాజమాన్య శిక్షణ పరిశోధన సంస్థ హైద్రాబాద్ సంయుక్తంగా నీటి యాజమాన్యం, సంరక్షణపై జిల్లాకు చెందిన వ్యవసాయాధికారులకు శిక్షణ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ శిక్షణ రెండు రోజుల పాటు కొనసాగుతుందన్నారు. వర్షాకాలంలో వాన నీటిని ఒడిసి పట్టేందుకు కొలనులు చేపట్టుకునేలా అవగాహన కల్పించాలన్నారు. బిందు, తుంపర సేద్యం రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. నీటి పరిరక్షణ ద్వారా లాభసాటి వ్యవసాయం సాధ్యమవుతుందన్నారు. పరిశోధన సంస్థ సభ్యులు సునీత, గిరీష్, శ్రీజ, సుబ్బారావు , ఏవో రజిత పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఆశా వర్కర్ల ధర్నా

నస్పూర్, ఫిబ్రవరి 9: పెండింగ్‌లో ఉన్న రెండు నెలల వేతనాలు చెల్లించాలని, ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో నాయకులు ధర్నా చేశారు. కలెక్టర్ చౌరస్తా నుంచి ఆశా వర్కర్లు ఊరేగింపుగా కలెక్టరేట్‌కు చేరుకుని గేట్ ఎదుట బైఠాయించారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టరేట్‌లో ఏవో రాజేశ్వర్‌కు అందజేశారు. ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షకార్యదర్శులు సమ్మక్క, శోభ, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్‌లు మాట్లాడుతూ డిసెంబర్, జనవరి నెలలకు సంబంధించిన వేతనాలు రాలేదన్నారు. కుటుంబ పోషణ కష్టతరంగా మారిందని వాపోయారు. ఎండీఏ, లెప్రసీ సర్వేలు తమతో చేయించారని, ఇప్పటివరకు డబ్బులు చెల్లించలేదన్నారు. డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. సభ్యులు సరోజ, నీరజా, పద్మ, కిరణ్, కుమారి, స్వప్న, వజ్రదేవి, భారతి, సుజాత, పుష్ప, భాగ్య పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశా వర్కర్లు

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

హాజీపూర్, ఫిబ్రవరి 9: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఇటీవల ముల్కల్ల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఆహారంలో పురుగులు కనిపించడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు శుక్రవారం పాఠశాలను సందర్శించి వంట గదిని పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. అన్నం మెత్తగా ఉడికిందని, కూరగాయలు నాణ్యతగా లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు రోజు కోడిగుడ్డు అందిస్తున్నారా అని ప్రిన్సిపాల్ మోహన్‌ను ప్రశ్నించారు. ప్రిన్సిపాల్ సరైన సమాధానం చెప్పకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. నాణ్యమైన ఆహారం అందించడం లేదని విద్యార్థులు ఫుడ్ కమిషన్ సభ్యులకు తెలిపారు. నీటి సౌకర్యం, మరుగుదొడ్లు శుభ్రంగా లేవని అసహనం వ్యక్తం చేశారు. వారానికి ఒకసారి నాన్‌వెజ్ పెట్టకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలలో ముక్కిన బియ్యం వండడం, నాణ్యమైన కూరగాయలు ఎందుకు వాడడం లేదని నిర్వాహకులపై అసహనం వ్యక్తం చేశారు. ఫుడ్ కమిషన్ సభ్యులు మాట్లాడుతూ విద్యార్థులకు మెను ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని, పాఠశాలలో విద్యార్థులకు తగిన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. అనంతరం సివిల్ సప్లయి అధికారులపై, కూరగాయలు సప్లయి చేసే కాంట్రాక్టర్‌పై, ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని గురుకులాల ఆర్‌సీవో, డీఈవోను ఆదేశించారు. పది రోజుల్లో నివేదికలు తమకు అందజేయాలని ఆదేశించారు. ముల్కల్లలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి నాణ్యతగా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులు ఇంటి నుంచి నుంచి భోజనాలు తెచ్చుకోవడం వారి దృష్టికి రావడంతో ప్రధానోపాధ్యాయుడు గణపతిరెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కూరగాయలు, బియ్యం నాణ్యతగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఫుడ్ కమిషన్ సభ్యులు గోవర్ధన్ రెడ్డి, ఆనంద్, శారద, భారతి, జ్యోతి, అదనపు కలెక్టర్ మోతిలాల్, ఆర్‌సీవో స్వరూపరాణి, డీఆర్‌డీవో శేషాద్రి, డీఈవో యాదయ్య, ఎంఈవో పోచయ్య పాల్గొన్నారు.





ముల్కల్ల పాఠశాలలో భోజనాలు పరిశీలిస్తున్న రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు, చైర్మన్‌తో మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

కమిషన్ చైర్మన్‌ను కలిసిన కలెక్టర్

మంచిర్యాల కలెక్టరేట్: కలెక్టరేట్ కార్యాలయానికి వచ్చిన జాతీయ ఆహార సంస్థ కమిషన్ గోలి శ్రీనివాస్ రెడ్డిని కలెక్టర్ బదావత్ సంతోష్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. కమిషన్ చైర్మన్ మాట్లాడుతూ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకంలో అందించే మెనూను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అదనపు కలెక్టర్, ఆహార సంస్థ సభ్యులు, డీఆర్‌డీవో శేషాద్రి పాల్గొన్నారు.

ఎన్నికల్లో పారదర్శకంగా విధులు నిర్వహించాలి

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 9: రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో విధులు కేటాయించిన వీడియో, ఫొటోగ్రాఫర్లు పారదర్శకంగా విధులు నిర్వహించాలని అదనపు కలెక్టర్ మోతిలాల్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వీడియో, ఫొటోగ్రాఫర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ విధుల్లో జవాబుదారి తనంతో పని చేయాలన్నారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా వీడియో సర్వేయలెన్స్, స్టాటిక్ సర్వేయలెన్స్ ప్లయింగ్ స్క్వాడ్ టీం, ఇతర బృందాలను నియమిస్తామన్నారు. చెక్‌పోస్టుల వద్ద ప్లైయింగ్ స్క్వాడ్‌లు తనిఖీలు చేసే సమయంలో ప్రతి అంశాన్ని చిత్రీకరించాలన్నారు. అభ్యర్థుల ప్రచారాలు, ర్యాలీలు, సమావేశాలను చిత్రీకరించాలన్నారు. ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

గుణాత్మక విద్యను అందించాలి

లక్సెట్టిపేటరూరల్, ఫిబ్రవరి 9: విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించాలని డీఈవో యాదయ్య ఆదేశించారు. మిట్టపల్లి ప్రాథమిక పాఠశాలను శుక్రవారం సందర్శించారు. విద్యార్థుల చేత పాఠాలను చదివించి ప్రగతిని పరిశీలించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు కృష్ణమోహన్ ఉన్నారు.

పుస్తకావిష్కరణ

ఏసీసీ, ఫిబ్రవరి 9: ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థుల కోసం రూపొందించిన వర్క్‌బుక్‌ను డీఈవో యాదయ్య శుక్రవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ వర్క్‌బుక్‌ను జిల్లాలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు పంపిణీ చేస్తామన్నారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సత్తయ్య మాట్లాడుతూ ఈ నెల 13న స్పెల్ విజార్డ్ పోటీలను జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండల స్థాయిలో గెలుపొందిన విద్యార్థులు పాల్గొనాలన్నారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి విజయలక్ష్మీ, ఏసీజీవో దామోదర్, కోఆర్డినేటర్‌లు సత్యనారాయణమూర్తి, చౌదరి, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అప్రెంటీస్‌షిప్ మేళా

మందమర్రిటౌన్, ఫిబ్రవరి 9: పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈనెల 12న జాతీయ అప్రెంటీస్‌షిప్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ దేవానంద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ మేళాలో పలు కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. ఆయా ట్రేడ్‌లలో పాసైన వారు మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మేళాకు హాజరయ్యే వారు సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు. వివరాల కోసం 9154549697లో సంప్రదించాలన్నారు.

ఆటోలో పరిమితిని మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దు



మ్యాదరిపేటలో ఆటో డ్రైవర్స్‌కు రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్న ఏఎంవీఐ

దండేపల్లి, ఫిబ్రవరి 9: ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని మంచిర్యాల అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ ఆటో డ్రైవర్లకు సూచించారు. 37వ జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం మ్యాదరిపేటలో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ప్రతీ ఒక్కరు రోడ్డు భద్రత నియమాలను పాటించాలన్నారు. ఆటోలో డ్రైవర్ పక్కన ఎవరిని ఎక్కించుకోకూడదని, ఆటోలో ఆరుగురు విద్యార్థులను మాత్రమే తీసుకు వెళ్లాలన్నారు. విద్యార్థుల బ్యాగులను బయటకు ప్రమాదకరంగా వేలాడదీయరాదన్నారు. మానవ తప్పిదాలతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అతి వేగం, అజాగ్రత్తగా వాహనాలు నడపడంతోనే రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. వాహనాన్ని నడిపే సమయంలో కుటుంబ సభ్యులను మదిలో ఊహించుకోవాలన్నారు. రోడ్డు భద్రత విషయంలో ప్రతీ ఒక్కరు చైతన్యం కావాలన్నారు. హెల్మెట్, సీటుబెల్ట్ ధరించి వాహనం నడుపాలన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరు డ్రైవింగ్ లెసెన్స్ పొందిన తర్వాతే వాహనం నడపాలన్నారు.

నెన్నెల: రహదారి భద్రత నిబంధనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని ఎస్సై శ్యామ్‌పటేల్ అన్నారు. నెన్నెలలో అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా బైక్ ర్యాలీ నిర్వహించి, డ్రైవర్లు, యువకులతో ప్రతిజ్ఞ చేయించారు. ఎస్సై పలు విషయాలపై వాహన డ్రైవర్లు, యువకులకు అవగాహన కల్పించారు. రోడ్డు భద్రత నిబంధనలు పాటిస్తే సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవచ్చన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. మత్తు పానీయాలు సేవించి వాహనాలు నడపరాదన్నారు. సెల్‌ఫోన్‌లో మాటాడుతూ డ్రైవింగ్ చేయడం ప్రమాదకరమన్నారు. వాహనదారులు ఆర్‌సీ, డ్రైవింగ్ లైసెన్సు, ఇన్సూరెన్సు కాపీలు ఉంచుకోవాలని ఎస్సై సూచించారు. హెచ్‌సీ విజయ్, సిబ్బంది అనంతరాం పాల్గొన్నారు.

ముళ్ల చెట్లను తొలగించిన పోలీసులు

కన్నెపల్లి: ముత్తాపూర్ నుంచి నాయకునిపేట వరకు రోడ్డుకిరువైపులా ఉన్న తుమ్మ చెట్లను శుక్రవారం పోలీసులు ఎక్స్‌కావేటర్‌తో తొలగించారు. తుమ్మ చెట్లు రోడ్డుపైకి రావడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని చెట్లను తొలగించినట్లు తెలిపారు.

రైస్‌మిల్లర్లు లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 9: రైస్‌మిల్లర్లకు కేటాయించిన లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ మోతిలాల్, ఆర్డీవోలు రాములు, హరికృష్ణ, జిల్లా పౌరసరఫరాల అధికారి వాజిద్, మేనేజర్ గోపాల్‌తో కలిసి రైసుమిల్లర్లు, తహసీల్దార్‌లతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని రైసుమిల్లులకు వాటి సామర్థ్యానికి అనుగుణంగా లక్ష్యాలు కేటాయించగా 73 శాతం పూర్తి చేశారన్నారు. నిర్లక్ష్యం చేస్తే కఠినచర్యలు తీసుకొంటామన్నారు. కేటాయించిన లక్ష్యాన్ని పూర్తిచేసే విధంగా మండలాల వారీగా రోజు పురోగతిని పరిశీలిస్తామని తెలిపారు. నెలాఖరులోగా లక్ష్యాలను పూర్తిచేయాలని సూచించారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జడ్పీచైర్‌పర్సన్ భాగ్యలక్ష్మీఓదెలు

మందమర్రిటౌన్, ఫిబ్రవరి 9: క్రీడలతో మంచి భవిష్యత్‌తోపాటు ఆరోగ్యం, క్రమశిక్షణ అలవడుతుందని జడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మీఓదెలు తెలిపారు. శుక్రవారం ఏఆర్ డీఎస్పీ శశిధర్ స్మారక రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ ఇన్విటేషన్ టోర్నమెంట్‌కు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి శశిధర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం పోటీలను ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో క్రీడలకు, క్రీడాకారులకు పెద్దపీట వేస్తామన్నారు. క్రీడా కోటాలో ఉద్యోగాలు లభిస్తాయన్నారు. పోటీల్లో 20 జట్లు పాల్గొన్నాయి. క్రీడాకారులు గెలుపోటములను ఒకే విధంగా తీసుకోవాలన్నారు. ఎస్‌ఐ చంద్రకుమార్,శశిధర్ సతీమణి మమత పాల్గొన్నారు.

గద్వాల్, అంతర్గాం జట్లు తలపడగా గద్వాల్ 3-2తో విజయం సాధించింది. రెండో మ్యాచ్‌లో సోమగూడెం-కరీంనగర్ జట్లు తలపడగా సోమగూడెం జట్టు 1-0తో గెలుపొందింది. రాష్ట్ర రెఫరీలు టిల్లు, జ్యోతిలు వ్యవహరించారు. నిర్వాహకులు రమేష్, రాజనర్సు, రాంవేణులు పాల్గొన్నారు.

ఈ నెల 24 నుంచి టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్ష

ఏసీసీ, ఫిబ్రవరి 9: టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షను ఈ నెల 24 నుంచి 27 వరకు నిర్వహించనున్నట్లు డీఈవో యాదయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డ్రాయింగ్ లోయర్ గ్రేడ్, హయ్యర్‌గ్రేడ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ లోయర్, హయ్యర్‌గ్రేడ్‌లకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. హాల్ టికెట్‌లను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్‌చేసుకోవాలన్నారు.

కొనసాగుతున్న ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

ఏసీసీ, ఫిబ్రవరి 9: ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు జిల్లా వ్యాప్తంగా శుక్రవారం సజావుగా జరిగాయి. ఉదయం జనరల్‌లో 423 మందికి 402 మంది హాజరయ్యారు. ఒకేషనల్‌లో 137 మందికి 124 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షలో జనరల్‌లో 333 మందికి 325 మంది హాజరు కాగా ఒకేషనల్‌లో 53 మందికి 53 మంది హాజరయ్యారు. 36 పరీక్ష కేంద్రాల్లో పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు డీఐఈవో శైలజ తెలిపారు.

ఈ నెల 12న జిల్లా స్థాయి సైన్స్ పోటీలు

ఏసీసీ, ఫిబ్రవరి 9: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం నిర్వహించాల్సిన జిల్లా స్థాయి సైన్స్ పోటీలను ఈ నెల 12న నిర్వహిస్తున్నట్లు డీఈవో యాదయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన విద్యార్థులు హాజరు కావాలని సూచించారు.

సీఎంను కలిసిన ఎమ్మెల్యే



బెల్లంపల్లి, ఫిబ్రవరి 9: అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా శుక్రవారం బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. బెల్లంపల్లి నియోజకవర్గంలోని పలు అభివృద్ధి విషయాలను సీఎంకు విన్నవించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

విద్యార్థులకు రక్త పరీక్షలు



విద్యార్థుల నుంచి రక్త నమూనాలు సేకరిస్తున్న వైద్యులు

నెన్నెల, ఫిబ్రవరి 9: అనీమియా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం రక్త పరీక్షలు నిర్వహించారు. వంద మందికి పరీక్షలు చేయగా పది మంది రక్తహీనతతో బాధపడుతున్నట్టు గుర్తించారు. వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అనీత, వైద్యాధికారి డాక్టర్ జుబేర్, స్థానిక పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మణ్, ఫార్మసిస్టు రుక్మిణి, ఏఎన్‌ఎం స్వప్న తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియా కో ఆర్డినేటర్‌గా శశికుమార్

మందమర్రిరూరల్, ఫిబ్రవరి 9 : జిల్లాయూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా కో ఆర్డినేటర్‌గా చిర్రకుంట గ్రామానికి చెందిన రాంటెంకి శశికుమార్ నియమితులయ్యారు. శుక్రవారం చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి, ఆయన కుమారుడు వంశీకృష్ణలు శశికుమార్‌కు నియామకపత్రం అందించారు.

హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు

హాజీపూర్, ఫిబ్రవరి 9 : వేంపల్లిలోని ఎస్‌ఆర్‌ఎం నర్సింగ్ కాలేజీలో ఈ నెల 12న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సీనియర్ మహిళలు, పురుషుల జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తామని అధ్యక్షుడు గోనె శ్యాంసుందర్‌రావు, ప్రధాన కార్యదర్శి రమేష్‌లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 9866395859లో సంప్రదించాలన్నారు.

18 నుంచి గూడెంగుట్ట బ్రహ్మోత్సవాలు

దండేపల్లి, ఫిబ్రవరి 9: గూడెం రమాసహిత సత్యనారాయణ స్వామి దేవాలయంలో ఈనెల 18 నుంచి 25 వరకు స్వామి వారి కల్యాణ బ్రహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ పేర్కొన్నారు. 21 బుధవారం సాయంత్రం 5గంటలకు స్వామి కల్యాణం, 24 శనివారం పౌర్ణమి మహాజాతర జరుగుతుందన్నారు. 25న స్వామివారి రథోత్సవం, ఏకాంత సేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పెద్దపల్లి ఎంపీ బొర్లకుంట వెంకటేష్‌నేత, ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావులు హాజరవుతారు. భక్తులు రూ. 500 చెల్లించి కల్యాణ వేడుకలో పాల్గొన వచ్చన్నారు. కల్యాణంలో పాల్గొనే దంపతులకు ఉత్తరీయుం, కనుములు శేషవస్త్రాములతో పాటు లడ్డు ప్రసాదం అందజేయనట్లు ఈవో, ఆలయ వ్యవస్థాపక కుటుంబసభ్యులు గోవర్ధన రఘుస్వామి, రేనవేషన్ కమిటీ సభ్యులు, ఆలయ అర్చ కులు, సిబ్బంది తెలిపారు.



గూడెం ఆలయంలోని రమా సహిత సత్యనారాయణ స్వామి

ప్రభుత్వ స్థలం కబ్జాకు యత్నం

మందమర్రిటౌన్, ఫిబ్రవరి 9 : మందమర్రి మార్కెట్ సెంటర్‌లోని ఎస్‌బీఐ బ్యాంకు ఎదురుగా ఉన్న ఆరు గుంటల ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసేందుకు ఓ వ్యాపారి ప్రయత్నాలు చేస్తున్నాడు. ఇది ప్రభుత్వ స్థలం అని ఏర్పాటు చేసిన బోర్డును తొలగించాడు. దుకాణ సముదాయాన్ని ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తున్నాడు. ఇప్పటికి పలుమార్లు నిర్మాణానికి ప్రయత్నించగా స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న అధికారులు వచ్చి అడ్డుకుంటున్నారు. అయినా వ్యాపారి మాత్రం నిర్మాణ ప్రయత్నాలను ఆపడం లేదు. నిర్మాణం చేయడానికి స్థలంలో ఇటుకలను కూడా వేయించాడు. భూమి తనదేనని చెబుతూ నిర్మాణానికి ప్రయత్నిస్తున్నాడు. ఇంత జరుగుతున్న ప్రభుత్వ అధికారులు ఇది ప్రభుత్వ భూమి అని బోర్డును ఏర్పాటు చేయకపోవడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ భూమి తనదేనంటూ మరోసారి నిర్మాణం చేపటానికి ఇటుకలు, ఇసుక సిద్ధం చేసుకున్నాడు. ప్రభుత్వ స్థలాల్లో బోర్‌వెల్‌లు ఏర్పాటు చేసి దుకాణ సముదాయాల కోసం నీటిని వినియోగించుకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రభుత్వ భూములు కబ్జా కాకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

నమో యాప్‌పై అవగాహన

తాండూర్, ఫిబ్రవరి 9: మండలంలోని రేపల్లెవాడ గ్రామంలోని కొత్తపల్లి పంచాయతీ బూత్ నెంబర్ 138లో గావ్ ఛలో అభియాన్ కార్యక్రమంలో భాగంగా యువకులకు నమో యాప్‌పై బీజేపీ నాయకులు అవగాహన కల్పించారు. మొబైల్ యాప్ డౌన్‌లోడ్ చేసి తగిన సూచనలు అందించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మహీదర్‌గౌడ్, నాయకులు శేషగిరి, శ్రీనివాస్, ప్రదీప్, విగ్నేష్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

భీమారం, ఫిబ్రవరి 9: భీమారం మండల కేంద్రంలోని పలు సమస్యలను పరిష్కరించాలని శుక్రవారం కాంగ్రెస్ నాయకులు తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. ప్రధాన ప్రాంతాల్లో పబ్లిక్ టాయిలెట్‌లు,క్రీడా మైదానం ఏర్పాటు చేయాలని కోరారు. మండల కాంగ్రెస్ నాయకులు కొక్కుల నరేష్, శ్యాంసుందర్‌రెడ్డి, తిరుపతి, రవి, అజయ్, రవితేజ, సుధాకర్, మధుకర్ పాల్గొన్నారు.

సభల పోస్టర్ల విడుదల

లక్షెట్టిపేటరూరల్, ఫిబ్రవరి 9: మండలంలోని చెల్లంపేట గ్రామంలో శుక్రవారం సీపీఎంఐఎల్ న్యూడెమోక్రసీ పార్టీ ఖమ్మంలో మార్చి 3, 4, 5 తేదీల్లో నిర్వహించే జాతీయ మహాసభల పోస్టర్లను శుక్రవారం జిల్లా కార్యదర్శి జాడి దేవరాజ్ విడుదల చేశారు. నాయకులు రమాదేవి, సురేష్, పోశన్న, బాపు, భూమక్క, లక్ష్మక్క తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 9: ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఆలిండియా స్టూడెంట్ బ్లాక్ రాష్ట్ర అధ్యక్షుడు జవారే రాహుల్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని చార్వాక ట్రస్టు హాలులో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పరిష్కరించడం లేదని తెలిపారు. పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గురుకులాలు, సంక్షేమ వసతి గృహాల్లో చదువుకుంటున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కోరారు. అనంతరం పలువురు సంఘంలో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. శేఖర్, సన్నిగౌడ్, సిద్దార్థ, కుతుబ్, సతీష్, జతిన్, సయ్యద్, సాయి పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న డీఆర్‌డీవో శేషాద్రి

హాజీపూర్, ఫిబ్రవరి 9 : కర్ణమామిడిలో శుక్రవారం ఉపాధిహామీ పనులను డీఆర్‌డీవో శేషాద్రి పరిశీలించారు. మట్టి రోడ్డు నిర్మాణం పనులను సందర్శించి కూలీలకు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో 50 మంది కూలీలు పనులకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. కూలీలకు పెద్ద సంఖ్యలో పనులను కల్పించాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో ఎంపీ హైై, ఈజీఎస్ సిబ్బంది ఉన్నారు.

పారిశుధ్య పనులను సక్రమంగా నిర్వహించాలి



పెగడపల్లిలో సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రాహుల్, ప్రకృతి వనంలో శ్రమదానం చేస్తున్న డీపీవో

జైపూర్, ఫిబ్రవరి 9: గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య పనులను సక్రమంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ రాహుల్ పేర్కొన్నారు. శుక్రవారం ఎలకంటి, గంగిపెల్లి, పెగడపల్లి గ్రామాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో పారిశుధ్య పనులను చేపట్టాలని, మురికి కాలువలు, రోడ్లను శుభ్రం చేయాలన్నారు. ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాల్లో ప్రజలను భాగస్వాములను చేయాలని సూచించారు. మహాలక్ష్మీ పథకం సర్వే పనులను పరిశీలించారు. సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. ఎంపీడీవో సత్యనారాయణ, ప్రత్యేకాధికారి తిరుపతమ్మ, కార్యదర్శులు స్నిగ్ధ, శ్రావణ్, సిబ్బంది ఉన్నారు.

చెన్నూరు: గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని డీపీవో వెంకటేశ్వర్‌రావు అన్నారు. ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా కిష్టంపేటలో పల్లెప్రకృతి వనంలో డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లతో కలిసి శ్రమదానం చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని మురికి కాలువలను శుభ్రం చేయాలన్నారు. దోమలు వృద్ధి చెందకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. చనిపోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలను నాటాలని కార్యదర్శులకు సూచించారు. ప్రత్యేకాధికారి అజ్మత్ అలీ, కార్యదర్శి దివాకర్ పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: అందుగులపేట గ్రామాల్లో ప్రత్యేకాధికారులు పారిశుధ్య పనులను నిర్వహించారు. చెత్తా,చెదారం తొలగించారు. మురికి కాలువలను సిబ్బంది చేత శుభ్రం చేయించారు. అందుగులపేటలో హరితహారంలో నాటిన మొక్కలకు నీరు పోశారు. డంపింగ్‌యార్డులోని పిచ్చి మొక్కలను తొలగించారు. నాటిన మొక్కలను సంరక్షించాలని ఎంపీడీవో శశికళ కార్యదర్శులకు సూచించారు. కార్యదర్శి నరేష్, గ్రామస్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

తాండూర్: తాండూర్‌లో ప్రత్యేకాధికారి ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులను నిర్వహించారు. నర్సరీలో మొక్కలు నాటారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. చెత్తను డబ్బాల్లో వేసి సిబ్బందికి అందజేయాలన్నారు. సెగ్రిగేషన్ షెడ్‌లో వర్మీకంపోస్టు తయారీని పరిశీలించారు. కార్యదర్శి తపాస్, నాయకులు ఈసా, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, పాల్గొన్నారు.

దండేపల్లి: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకునే బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని తహసీల్దార్ సంధ్యరాణి, ఎంపీడీవో మల్లేషంలు అన్నారు. ప్రత్యేక పారిశుధ్య వారోత్సవాలలో భాగంగా పలు గ్రామాల్లో కార్యక్రమాలను చేపట్టారు. చెత్త కుప్పలు, నీటి నిల్వ లేకుండా చూడాలన్నారు. వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా సిబ్బంది చర్యలు చేపట్టాలన్నారు.

పార్లమెంట్ సమావేశాల్లో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలి



ఢిల్లీలో జరిగిన సమావేశంలో బీసీ సంఘం నాయకులు

మందమర్రిటౌన్, ఫిబ్రవరి 9: పార్లమెంట్ సమావేశాల్లో బీసీ బిల్లును ప్రవేశపెట్టాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. శుక్రవారం ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన ఆలిండియా ఓబీసీ నేషనల్ కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. కేంద్రం వెంటనే బీసీల సమస్యలను పరిష్కరించడంతోపాటు జనాబా ప్రకారం రిజర్వేషన్‌లను అమలుచేయాలని, కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. రాజ్యాధికారంలోనే బీసీల హక్కుల సాధన సాధ్యమవుతుందన్నారు. రానున్న రోజుల్లో జిల్లాల్లో కూడా సభలు సమావేశాలు నిర్వహించి బీసీలను ఐక్యం చేస్తామని తెలిపారు. బీఆర్‌ఎస్ రాజ్యసభ్య సభ్యుడు కేశవరావు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ బీసీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందన్నారు. జిల్లా అధ్యక్షుడు చంద్రమోహన్‌గౌడ్, నాయకులు సలాముద్దీన్, వేణు, శంకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

నెన్నెల, ఫిబ్రవరి 9: మైలారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులు నాయిని శ్రీజా, పడిగెల వైష్ణవి, మంచర్ల అంజలి, 9వ తరగతి విద్యార్థి గంట వైష్ణవిలు రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ బాలికల కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం చంద్రశేఖర్‌రెడ్డి, పీఈటీ సాంబమూర్తి తెలిపారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీసీసీలో నిర్వహించిన జిల్లా స్థాయి సబ్ జూనియర్స్ పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. ఈనెల 16 నుంచి 19 వరకు సూర్యపేట జిల్లాలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

జాతరకు ఏర్పాట్లు

మందమర్రిటౌన్, ఫిబ్రవరి 9: పాలవాగు ఒడ్డున సింగరేణి ఆధ్వర్యంలో ఈ నెల 21 నుంచి 24 వరకు జరిగే సమ్మక్క సారలమ్మ జాతరకు సంబంధించిన పనులు శరవేగంగా జరుగుతున్నాయి. శుక్రవారం గద్దెలకు రంగులు వేశారు. పోచమ్మ తల్లి ఆలయాన్ని ముస్తాబు చేశారు. విద్యుత్ దీపాలను అలంకరించారు. తాత్కాలిక రోడ్డు పనులను ప్రారంభించారు. ఏర్పాట్లను మందమర్రి జీఎం మనోహర్ పరిశీలించారు.

పీఆర్‌టీయూ ఆవిర్భావ దినోత్సవం

జన్నారం, ఫిబ్రవరి 9: జన్నారంలోని పీఆర్‌టీయూ సంఘం భవన్‌లో శుక్రవారం పీఆర్‌టీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పీఆర్‌టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు తిరుమలరెడ్డి ఇన్నారెడ్డి పతాకాన్ని ఆవిష్కరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టె శంకర్, సహా అధ్యక్షుడు తిరుపతి, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కట్ట రాజమౌళి, సత్యనారాయణ, ఎంఈవో విజయ్‌కుమార్, నాయకులు జనార్దన్, రాజారావు, దేవాజీ, చంద్రశేఖర్, కాంతన్న, నర్సయ్య, శ్రీనివాస్, ప్రవీణ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం

వేమనపల్లి, ఫిబ్రవరి 9: మండలంలోని గొర్లపల్లి, సుంపుటం, బుయ్యారం, సూరారం, జిల్లెడ, నాగా రం గ్రామాల్లో శుక్రవారం సీసీ రోడ్ల నిర్మాణ పను లను జెడ్పీటీసీ స్వర్ణలత ప్రారంభించారు. ఈ సంద ర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.1.15 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణాలను ప్రారంభిచామన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సయ్యద్ సాబీర్ అలీ, కార్యదర్శి సంతోష్‌రెడ్డి, మాజీ సర్పంచు గాలి మధు, ఎంపీటీసీ చంద్రకళ, పురు షోత్తం, కుబిడె కిష్టయ్య, రమేష్, జగన్, శంకర్, శ్రీనివాస్, మదుకర్‌గౌడ్, శంకర్ పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

జన్నారం, ఫిబ్రవరి 9 : రోటిగూడ సామాజిక సంక్షేమ కమిటీ సభ్యులు శుక్రవారం 20 మంది నిరుపేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. దాదాపు రూ.50 వేల విలువ గల సరుకులు పంపిణీ చేశామని సభ్యులు తెలిపారు. శ్రీనివాస్, గోపాల్, శ్రీనివాస్, సత్తయ్య, మల్లేష్, శ్రీనివాస్, రాజారెడ్డి, కమలాకర్, తిరుపతి పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థి ఆత్మహత్య



నీలేష్ (ఫైల్)

దండేపల్లి, ఫిబ్రవరి 9: పాతమామిడిపల్లికి చెందిన పదో తరగతి విద్యార్థి బలుగూరి నీలేష్(17) తల్లిదండ్రులు లేరనే బెంగతో మనస్తాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నీలేష్ మామిడిపల్లి ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. చిన్నప్పుడే తల్లి అనారోగ్యంతో మృతి చెందగా తండ్రి శంకర్ 14 ఏళ్ల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగి రాలేదు. అప్పటి నుంచి తాతయ్య నానమ్మ వద్ద ఉంటు చదువుకుంటున్నాడు. తల్లిదండ్రులు లేరనే బెంగతో మనస్తాపం చెంది ఈనెల 7న బుధవారం రాత్రి పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు లక్షెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందినట్లు ఎస్సై ప్రసాద్ పేర్కొన్నారు. మృతుడు నీలేష్ తాత వెంకటి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వెల్లడించారు. కాగా కొత్త మామిడిపల్లి గ్రామానికి చెందిన పెర్క సంఘం మండల అధ్యక్షుడు గడ్డం రాంచందర్ కుటుంబ సభ్యులకు రూ.5 వేల ఆర్థిక సాయం అందించారు. మాజీ సర్పంచులు గడ్డం రాజయ్య, తిరుపతి పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పోలీసులు పట్టుకున్న ఇసుక ట్రాక్టర్‌లు

చెన్నూరు, ఫిబ్రవరి 9: చెన్నూరు బతుకమ్మ వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న 11 ట్రాక్టర్లను శుక్రవారం పట్టుకున్నట్లు సీఐ రవీందర్ తెలిపారు. బతుకమ్మ వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారనే సమాచారం మేరకు వాగు వద్దకు తన సిబ్బందితో వెళ్లి ట్రాక్టర్‌లను పట్టుకున్నామన్నారు. పట్టుకున్న ఇసుక ట్రాక్టర్‌లను మంచిర్యాల మైనింగ్ ఏడీకి అప్పగించినట్లు సీఐ తెలిపారు.

రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు

చెన్నూరు, ఫిబ్రవరి 9: వాట్సాప్ గ్రూపులు, సోషల్ మీడియాలో అనవసరమైన రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ రవీందర్ హెచ్చరించారు. శుక్రవారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సోషల్ మీడియా, వాట్సాప్ గ్రూపుల్లో ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా పోస్టులు పెడితే చర్యలు తీసుకుంటామన్నారు. అడ్మిన్‌లు, గ్రూపు సభ్యులు జాగ్రత్తగా ఉండాలన్నారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెట్టిన పట్టణానికిచెందిన ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

చిత్రకళా ప్రదర్శనలో పాల్గొననున్న ఇందారం వాసి

జైపూర్, ఫిబ్రవరి 9 : హైదరాబాద్ సాలార్‌జంగ్ మ్యూజియంలో ఈ నెల 10 నుంచి 16 వరకు జరిగే మాస్టర్ స్ట్రోక్ 3 చిత్రకళా ప్రదర్శనకు మండలంలోని ఇందారం గ్రామానికి చెందిన చిప్పకుర్తి శ్రీనివాస్ పాల్గొనను న్నారు. శ్రీనివాస్ కుందారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డ్రాయింగ్ టీచర్‌గా పనిచేస్తున్నాడు. కరోనాపై శ్రీనివాస్ గీసిన చిత్రాలకు గుర్తింపు వచ్చింది. శ్రీనివాస్ మాట్లాడుతూ తనకు అవకాశం ఇచ్చిన చిత్రకారులు అంజి అకొండికి కృతజ్ఞతలు తెలిపారు.

క్రీడాకారుడికి చేయూత

బెల్లంపల్లి, ఫిబ్రవరి 9 : జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన సాయిప్రసాద్ అనే క్రీడాకారునికి శుక్రవారం తిలక్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ట్రాక్, షూస్‌లను అందజేశారు. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రత్నం రాజం, రంగ రామన్నలు మాట్లాడుతూ తిర్యాణి మండలంలోని పంగిడిమాదర ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న సాయి ప్రసాద్ ఈ నెల 12న గుజరాత్‌లో జరిగే అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యాడని, విద్యార్థి నిరుపేద కావడంతో సహాయం చేసినట్లు తెలిపారు. అనంతరం విద్యార్థిని సన్మానించారు. సభ్యులు శ్రీనివాస్, రమేష్, రాజ్‌కుమార్, సంజీవ్, వెంకటరాజం, రాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులు నిరసన

చింతలమానేపల్లి, ఫిబ్రవరి 9: సీఎం రేవంత్‌రెడ్డిపై మాజీఎమ్మెల్యే బాల్కసుమన్ అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం మండలకేంద్రంలో కాంగ్రెస్ నాయకులు నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్కసుమన్ నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్, శేఖర్, శంకర్, తిరుపతి, మహేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'పది' విద్యార్థులకు ప్రేరణ తరగతులు

కౌటాల, ఫిబ్రవరి 9: మండలకేంద్రంలోని జగదాంబ ఫంక్షన్ హాల్‌లో శనివారం పదవతరగతి విద్యార్థులకు వేకువ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రేరణ ప్రాజెక్టు ద్వారా తరగతులు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 9: కాగజ్‌నగర్ మండలం అందవెల్లికి చెందిన హరీష్(35) పురుగుల మందు తాగి శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నట్లు ఈసుగాం ఎస్సై రామన్ కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. హరీష్ తాగుడుకు బానిసై తరుచూ కుటుంబ సభ్యులతో గొడవలు పడుతుండేవాడు. గురువారం రాత్రి కూడా హరీష్ మద్యం తాగి వచ్చాడు. మద్యం మత్తులో ఇంటి సమీపంలో ఉన్న పురుగుల మందును తాగాడు. కుటుంబ సభ్యులు వెంటనే అతన్ని కాగజ్‌నగర్‌లోని ఓ ఆసుపత్రికి తరలించారు. మెరుగైనవైద్యం కోసం మంచిర్యాల ఆసుపత్రికి తరలించారు. కాగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందినట్లు పేర్కొన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఐదుగురిపై కేసు నమోదు

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 9: కాగజ్‌నగర్ మండలం బోడపల్లిలోని గడిల సత్తయ్యకు చెందిన భూమిలోకి అక్రమంగా ప్రవేశించి భయభ్రాంతులకు గురిచేసిన మల్లేష్, శంకర్, గణేష్, దేవయ్య, లచ్చన్నపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై రామన్ కుమార్ తెలిపారు.

సమ్మె నోటీసు అందజేత



డీఎంహెచ్‌వోకు సమ్మె నోటీసు అందజేస్తున్న రెండో ఏఎన్‌ఎంలు

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 9: ఈనెల16న జరిగే దేశవ్యాప్త సమ్మెలో భాగంగా శుక్రవారం నేషనల్ హెల్త్‌మిషన్‌లో పనిచేస్తున్న సెకండ్ ఏఎన్‌ఎంలు డీఎంహెచ్‌వో తుకారాంకు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీలలో పనిచేస్తున్న రెండో ఏఎన్‌ఎం లను రెగ్యులర్ చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు చిరంజీవి, ఏఎన్‌ఎంలు వసంత, సునీత, లీల, సత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

కెరమెరి: దేశవ్యాప్తంగా ఈనెల 16న జరిగే సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకుడు రాజేందర్ కోరారు. శుక్రవారం ఆయన మండలకేంద్రంలో మాట్లాడుతూ కార్యక్రమంలో అన్నివర్గాల వారు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

గృహజ్యోతి అమలుకు సహకరించాలి



వాంకిడిలో పత్రాలను పరిశీలిస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు

వాంకిడి, ఫిబ్రవరి 9: గృహజ్యోతి పథకానికి ప్రజలు సహక రించాలని విద్యుత్‌శాఖ ఏఈ శ్రీకాంత్ కోరారు. శుక్రవారం మండలంలోని బెండార గ్రామంలో విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో సిబ్బంది బృందాలుగా ఏర్పడి వివిధకాలనీల్లో వినియోగదారుల నుంచి వివరాలను సేకరించి మొబైల్ యాప్‌లో నమోదు చేశారు. కార్యక్రమంలో ఏవో ఈశ్వర్, ఏఏవో తుకారాం, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

దహెగాం: ప్రజాపాలనలో భాగంగా గ్యాస్ కనెక్షన్‌కు దరఖాస్తు చేసుకున్న వారి ఆధార్ కార్డు, రేషన్‌కార్డు, వినియోగదారుడి నంబర్ తప్పుగా రాసిన వారి లిస్టులో వచ్చిన వాటిని శుక్రవారం దహెగాం గ్రామ పంచాయతీలో అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేశ్వర్, కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాప్రాంగణాన్ని శుభ్రపరిచిన అధికారులు

● 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



క్రీడామైదానంలో రాళ్లను తొలగిస్తున్న గ్రామపంచాయతీ సిబ్బంది

పెంచికలపేట, ఫిబ్రవరి 9: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న క్రీడాప్రాంగణాలు చెత్తా చెదారంతో అలంకారప్రాయంగా మారుతున్నాయని ఈ నెల 9న 'ఆంధ్రజ్యోతి' జిల్లా అనుబంధంలో ప్రచురితమైన 'నిరుపయోగంగా క్రీడా ప్రాంగణాలు' కథనానికి అధికారులు స్పందించారు. శనివారం బొంబాయిగూడ గ్రామంలో క్రీడా ప్రాంగణాన్ని శుభ్రపరిచి చెత్తను తొలగించారు.

ఎంపీడీవోకు సన్మానం

పెంచికలపేట, ఫిబ్రవరి 9: మండలకేంద్రంలోని ఎల్కపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ఇటీవల ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన రమేష్‌ను బీజేపీ నాయకులు సత్కరించారు. అనంతరం మండలంలో నెలకొన్న సమస్యలను ఎంపీడీవో దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో నాయకులు మధుకర్, నగేష్, మహేష్,శివ, కమలాకర్, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో మాజీ వైస్‌ఎంపీపీ మృతి

జైనూర్, ఫిబ్రవరి 9: మండల మాజీ వైస్‌ఎంపీపీ కాంబ్లే దయానంద్ గురువారం రాత్రి గుండెపోటుతో మరణించాడు. ఆయన గూడమామడ ఎంపీటీసీగా టీడీపీ హయాంలో గెలుపొంది వైస్‌ఎంపీపీగా బాధ్యతలు నిర్వర్తించారు. ఎన్నో సామాజిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని మంచి నాయకుడిగా గుర్తింపు పొందారు. ఆయన అంత్యక్రియలు మండలంలోని కొండిబాగూడలో శుక్రవారం సాయంత్రం జరిగాయి. కాంగ్రెస్ పార్టీ ఆసిఫాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జ్ అజ్మీర శ్యాంనాయక్, భారత్ వాగ్మారె, జాడె నాగోరావ్, బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

పాఠశాలను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్



పాఠశాలలో బోధన తీరును పరిశీలిస్తున్న అదనపుకలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్‌రూరల్, ఫిబ్రవరి 9: మండలంలోని కోసార ప్రభుత్వ పాఠశాలను శుక్రవారం అదనపు కలెక్టర్ దీపక్ తివారి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బోధన తీరును పరిశీలించారు. ఉపాధ్యాయులు ఖచ్చితంగా సమయపాలన పాటించాలని విధుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలన్నారు. అనంతరం గ్రామంలో చేపడుతున్న వాటర్ షెడ్ పనులను పరిశీలించి పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.

టీఎస్‌యూటీఎఫ్ సదస్సును విజయవంతం చేయండి

వాంకిడి/బెజ్జూరు, ఫిబ్రవరి 9: జిల్లా కేంద్రంలోని ఎస్‌ఎం గార్డెన్స్‌లో ఈనెల 13న నిర్వహించే టీఎస్‌యూటీఎఫ్ జిల్లాకమిటీ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆసంఘం వాంకిడి, బెజ్జూరు మండలాల అధ్యక్ష, కార్యదర్శులు సుభాష్, హరీష్, శ్రీనివాస్, రవికుమార్ కోరారు. సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య, డీఈవో అశోక్, డీటీడీవో రమాదేవి హాజరవుతారని ఉపా ధ్యాయులు పెద్దసంఖ్యలో హాజరై విజయ వంతం చేయాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 9: జిల్లాషెడ్యూలు కులముల అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో 2024-25సంవత్సరానికి గాను బెస్ట్ అవైలెబుల్ స్కూల్ ఎంపిక కోసం జిల్లాలోని ప్రైవేటు ఆంగ్లమాధ్యమం పాఠశాలల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తామని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి సజీవన్ ఒక ప్రక టనలో తెలిపారు. దరఖాస్తు ఫారాల కోసం కార్యాలయంలో సంప్రదించాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈనెల 17లోగా అందజేయాలన్నారు.

ఘనంగా పీఆర్టీయూటీఎస్ ఆవిర్భావ దినోత్సవం

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 9: జిల్లా కేంద్రంలోని పీఆర్టీయూ భవన్‌లో శుక్రవారం పీఆర్టీయూటీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్య దర్శులు శ్రీనివాసరావు, ప్రకాష్, దేవాజీ, సాంబశివరావు, ప్రకాష్, బాబురావు, ఎన్.ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలి

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 9: జిల్లాలో వివిధ మండలాల నుంచి అక్రమంగా తరలిస్తున్న ఇసుకను అరికట్టాలని డీవైఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానికంగా మాట్లాడుతూ జిల్లాకేంద్రంలోని పెద్దవాగు, కనర్‌గాం, కాగజ్‌నగర్ పెద్దవాగు, రెబ్బెన గంగాపూర్‌వాగు నుంచి విచ్చలవిడిగా ఇసుక దందా కొనసాగుతోందన్నారు. ఈవిషయాన్ని అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే అధికారులు చర్యలు తీసుకోని పక్షంలో ఆందోళన చేస్తామన్నారు. సమావేశంలో నాయకులు టికానంద్, కార్తీక్, పురుషోత్తం, శ్రావణి, రాజ్‌కుమార్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 9: విద్యారంగ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఓయూ విద్యార్థి జేఏసీ రాష్ట్ర కార్యదర్శ అన్నం నాగర్జున డిమాండు చేశారు. శుక్రవారం కాగజ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాలు మారుతున్న కూడా విద్యారంగంలో సమస్యలు ఇంతవరకు పరిష్కరించటం లేదన్నారు. ఇప్పటికైనా కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం సమస్యలను పరిష్కరించేట్టు చూడాలన్నారు. ఈ సమావేశంలో సభ్యులు సాయి, రాజశేఖర తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎఫ్ఎల్‌సీ అంజన్న

ఆసిఫాబాద్ రూరల్, ఫిబ్రవరి 9: ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ఎఫ్ఎల్‌సీ కేంద్రంలో రైతులకు కేంద్రప్రభుత్వం అమలుచేస్తున్న జీవనజ్యోతి, సురక్షబీమా పథకాలపై శుక్రవారం నాబార్డు సౌకర్యంతో జిల్లా కేంద్రసహకార బ్యాంకు, సహకారసంఘం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. నాబార్డు డీడీఎం వీరభద్రరావు మాట్లాడుతూ భారత ప్రభుత్వం అమలుచేస్తున్న వివిధ రకాలరుణాలు, పథకాలగురించి వివరించారు. ఎఫ్ఎల్‌సీ అంజన్న మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి బ్యాంకులో పొదుపు ఖాతా తప్పనిసరిగా ఉండాలన్నా రు.సైబర్ నేరాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో సహకారబ్యాంకు మేనేజర్ అనిల్‌కుమార్, చైర్మన్ అలీబీన్‌అహ్మద్, ఫీల్డ్ ఆఫీసర్ రాజేంద్రకుమార్, డైరెక్టర్‌లు ఆశన్న, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి ఆదివాసీల పూజలు



పూజలు నిర్వహిస్తున్న ఆదివాసీలు

రెబ్బెన, ఫిబ్రవరి 9: మండలంలోని ఇందిరానగర్‌లోని శ్రీమహంకాళి ఆలయం లో శుక్రవారం జంగుబాయి మాలధారణ చేసిన స్వాములు పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకుడు దేవర వినోద్ తీర్థ, ప్రసాదాలను అందజేశారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

బెల్లంపల్లి, ఫిబ్రవరి 9: పట్టణంలోని కాంట్రాక్టర్ బస్తీకి చెందిన జాడి రవి(46) శుక్రవారం కాల్‌టెక్స్ రైల్వే ఫై ఓవర్‌బ్రిడ్జివద్ద రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ సురేష్‌గౌడ్ తెలిపారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న రవి మద్యానికి బానిసయ్యాడు. ఈక్రమంలో మనోవేదనతో దక్షిణ్ ఎక్స్‌ప్రెస్‌రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని మృతుడి భార్య రాణికి అప్పగించినట్లు తెలిపారు.

‘సంక్షేమం’లో ఆర్థిక సంక్షోభం

- సంక్షేమ వసతిగృహాలకు ఎనిమిది నెలలుగా అందని బిల్లులు
- అప్పులు తెచ్చి వండిపెడుతున్న సంక్షేమాధికారులు
- మెనూ ప్రకారం విద్యార్థులకు అందని భోజనం
- జిల్లాలో పెండింగ్ బకాయిలు దాదాపు రూ.5కోట్లు

పెంచికలపేట, ఫిబ్రవరి 9: అన్నివర్గాల విద్యార్థులకు వసతితో కూడిన గుణాత్మక విద్యను అందించాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంక్షేమ వసతిగృహాలు నేడు ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతున్నాయి. ఏడెనిమిది నెలలుగా డైట్‌చార్జీలు విడుదల కాకపోవడంతో జిల్లాలో పెండింగ్ బకాయిలు సుమారుగా రూ.5కోట్లు ఉన్నాయి. దీంతో సంక్షేమ వసతి గృహాల సంక్షేమాధికారులు అప్పులు చేసి విద్యార్థులకు భోజనం వండి పెడుతున్నారు. బయట అప్పులు చేసి వసతి గృహాలను నిర్వహించాల్సి రావడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరగడం, బిల్లులు సకాలంలో అందకపోవడంతో విద్యార్థులకు మెనూప్రకారం భోజనం కూడా అందించడం లేదు. దీంతో అటు సంక్షేమా ధికారులు, ఇటు విద్యార్థులకు ఇబ్బందులు తప్పడంలేదు.



కెరమెరిలో విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న నిర్వాహకులు



మొగడ్‌దగడ్‌లో భోజనం చేస్తున్న విద్యార్థులు

నెలల తరబడి జాప్యం..

జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ అభివృద్ధిశాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వసతి గృహాల్లో విద్యార్థులకు మెనూప్రకారం భోజనం అందించే విధంగా సంక్షేమాధికారులు వారి శక్తికి మించి కృషి చేస్తున్న ప్పటికీ విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందడం లేదు. నెలల తరబడి డైట్ బిల్లులు మంజూరు కావడం లేదు. డీటీవోలో బిల్లులు పెండింగ్‌లో ఉంటున్నాయి. దీంతో చేసేదేమీ లేక సంక్షే మాధికారులు అధికవడ్డీలకు అప్పులు తీసుకువస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. సంక్షేమ శాఖలకు సంబంధించి ఆయాశాఖలు టెండర్లు పిలిచి పాలు, పెరుగు, కూరగాయలు, మాంసం, నిత్యావసర సరుకులను సరఫరా చేయాల్సి ఉన్న సరుకుల సరఫరాకు కాంట్రాక్టర్లు ఉన్నా పూర్తి స్థాయిలో అందకపోవడంతో కిరాణ దుకాణాల నుంచి సరఫరా చేస్తున్నారు. ప్పటికీ అధిక ధరలు, ఇతర కారణాలతో అది పూర్తి స్థాయిలో అమలు కావడం లేదు. ఫలితంగా సంక్షేమశాఖాధికారులే ముందస్తుగా డబ్బులు చెల్లించి దుకాణాల్లో సరుకులు కొనుగోలు చేసి వసతి గృహాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సర్దుబాటు చేస్తున్నారు.

సరుకులు నిలిపేసిన జీసీసీ..

ఇక గిరిజనశాఖకు సంబంధించి వసతి గృహాలకు జీసీసీ స్టోర్ నుంచి కాంట్రాక్టర్లు సరఫరా చేయాల్సి ఉంది. అయితే బిల్లులు అందక పోవడంతో కొన్నిరోజులుగా సరుకులు సరఫరా నిలిపి వేశారు కొన్ని సరుకులు మాత్రమే జీసీసీ నుంచి వస్తున్నట్లు సమాచారం. దీంతో సంక్షేమాధికారులు అప్పులు తెచ్చి నిర్వహించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఈ అంశమై ఆయాశాఖల జిల్లా అధికారులను సంప్రదించగా కోరగా గత ఏడాది అక్టోబరు వరకు బడ్జెట్ విడుదల చేశామని, మిగితావి పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు.

జిల్లా సమాచారం..

జిల్లాలో గిరిజన ఆశ్రమపాఠశాలలు 46, పోస్టుమెట్రిక్4ఉండగా విద్యార్థుల సంఖ్య 11వేలు, బకాయిలు రూ.4కోట్లపైనే, బీసీ సంక్షేమ పాఠశాలలు 7, పోస్టుమెట్రిక్ 4, విద్యార్థుల సంఖ్య 849, బకాయిలు రూ.70లక్షలపైనే, ఎస్సీ సంక్షేమ పాఠశాలలు 7, పోస్టు మెట్రిక్ 3, విద్యార్థుల సంఖ్యలో 567, బకాయి సమాచారం తెలియాల్సి ఉంది.

బిల్లులు వెంటనే విడుదల చేయాలి

తుమ్మిడె భీమేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి



పెండింగ్‌లో ఉన్న బిల్లులు వెంటనే విడుదల చేయాలి. ప్రభుత్వం విద్యా రంగంపై పూర్తిగా నిర్లక్ష్యం వహించింది. ఏడెనిమిది నెలలుగా సంక్షేమ వసతిగృహాలకు కోట్లలో బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని విడుదల చేయడంతోపాటు పెంచిన మెస్‌చార్జీలను అమలు చేయాలి. లేనిపక్షంలో ఆందోళన చేపడతాం.

పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 9: వచ్చే పార్లమెంట్ ఎన్నికల కోసం అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అదనపుకలెక్టర్ దీపక్ తివారితో కలిసి మాస్టర్‌ట్రైనర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే పార్ల మెంట్ ఎన్నికల్లో విధులు నిర్వహించే సెక్టోరల్ అధికారులు, ప్రిసైడింగ్, అదనపు ప్రిసైడింగ్ అధికారులు ఇతర సిబ్బందికి ఎన్నికలనియమావళి, విధుల నిర్వహణపై పూర్తిస్థాయిలో శిక్షణ ఇవ్వాలని తెలిపారు. ఎన్నికలసిబ్బంది సంఖ్య పెరిగే అవకాశం ఉన్నందున అందరికీ ఎలక్ట్రానిక్ ఓటింగ్ నిర్వహణపై అవగాహన కల్పించడం శిక్షకుల బాధ్యత అన్నారు. సమావేశంలో డీడీ రమదేవి, మాస్టర్ ట్రైనర్లు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు నెలకు పదివేలు అందించాలి

ఆసిఫాబాద్ రూరల్, ఫిబ్రవరి 9: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో ఉపాధి కోల్పోయిన ఆటోడ్రైవర్లకు ప్రతి నెల రూ.10వేల ఆర్థికసాయాన్ని ప్రభుత్వం అందించాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో అసెంబ్లీ సమావేశాలు జరుగు తున్న నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆటోలో అసెంబ్లీవరకు వెళ్లి తమ నిరసన తెలిపారు.



అసెంబ్లీ సమావేశాలకు ఆటోలో వెళ్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

కాగజ్‌నగర్ మున్సిపాలిటీ లక్ష్యం రూ.4కోట్లు

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 9: కాగజ్‌నగర్ మున్సిపాలిటీ ఆస్తిపన్ను టార్గెట్ రూ.4కోట్లుగా అధికారులు పెట్టుకున్నారు. నెల రోజుల నుంచి ఆస్తి పన్ను వసూలు చేసేందుకు అధికారులు స్పెషల్ డ్రైవ్ చేపట్టగా రూ.1.65కోట్లు వసూలయ్యాయి. ఇంకా రూ.2.45 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. రెండ్రోజుల క్రితం అదనపు కలెక్టర్ దీపక్ తివారి మున్సిపల్ అధికారులకు, సిబ్బందికి పెండింగ్ బకాయిలు, ఆస్తి పన్ను వసూలుపై సమీక్షా సమావేశం నిర్వహించి పెండింగ్ బకాయిలపై దృష్టిసారించాలని సూచించారు. వంద శాతం కోసం కమిషనర్ అంజయ్య ఆధ్వర్యంలో సిబ్బంది ఉదయం, సాయంత్రం మార్కెట్‌లోని పెండింగ్ బిల్లుల వసూలు కోసం తిరుగుతున్నారు. ఎస్పీఎం బకాయిలను యాజమాన్యం క్లియర్ చేసింది. కేవలం సర్‌సిల్క్ మిల్లు బకాయిలు రావాల్సి ఉంది.

ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

సిర్పూర్(టి), ఫిబ్రవరి 9: పారిశుధ్య స్పెషల్‌డ్రైవ్‌లో భాగంగా శుక్రవారం మండలంలోని అచ్చెల్లి, చింతకుంట, హీరాపూర్ గ్రామాల్లో ప్లాస్టిక్‌నిర్మూలనపై ఎంపీడీవో రాజేశ్వర్ ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్లను వాడకూడదని, ప్లాస్టిక్‌తో కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో కార్యదర్శులు ఉన్నారు. అలాగే మండల కేంద్రంలోని డౌనల్ ఏరియా, దర్గాషరీఫ్, తదితర కాలనీల్లో ఈవో కృష్ణమూర్తి ఆధ్వర్యంలో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు.

యాసంగి పంటలు పరిశీలించిన ఏవో

కౌటాల, ఫిబ్రవరి 9: మండలంలోని గుండాయిపేట శివారులోని యాసంగి పంటలను ఏవో రాజేష్ పరిశీ లించారు. ఈ సందర్భంగా క్లస్టర్‌పరిధిలో పంటలను నమోదు చేసుకోవాలని ఏఈవోలకు సూచించారు. అలాగే రైతులకు పలు సూచనలు అందజేశారు.

పిల్లలను పనులకు తీసుకెళ్లరాదు



విద్యార్థిని చేనుపనికి తీసుకెళ్తున్న తల్లిదండ్రులతో మాట్లాడుతున్న నోడల్ అధికారి ప్రకాష్

కెరమెరి, ఫిబ్రవరి 9: బడీడు పిల్లలను చేను పనికి తీసుకెళ్లి వారి భవిష్యత్‌ను అంధకారంలోకి నెట్టరాదని మండల నోడల్ అధికారి ఆడెప్రకాష్ అన్నారు. శుక్రవారం ఆయన భీమన్‌గొంది గ్రామంలో బడిమానేసి చేను పనులకు వెళ్తున్న పలువురు విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ప్రతిరోజు పిల్లలను బడికి పంపించాలని తెలిపారు.

కేసుల దర్యాప్తులో మరింత నాణ్యత పాటించాలి: ఎస్పీ

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 9: జిల్లాలో ఆయా పోలీసుస్టేషన్‌లలో నమోదై పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తుల్లో మరింతనాణ్యత పాటించాలని ఎస్పీ సురేష్ కుమార్ అన్నారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నెలవారీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఓల్డ్ యూఐ, గ్రేవ్ కేసులు, ఎస్సీ, ఎస్టీ కేసులు, కాంటెస్టెడ్ కేసులపై రివ్యూ నిర్వహించారు. నమోదైన కేసులలో శిక్షల శాతాన్ని పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. జిల్లాలో అన్ని పోలీసు స్టేషన్‌ల పరిధిలో పెండింగ్‌లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి పోలీ సులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. పెండింగ్ కేసులను పూర్తిస్థాయిలో ఇన్వెస్టిగేషన్ చేసి డిస్పోజల్ చేయా లని సూచించారు. పోక్సో, ఎస్సీ, ఎస్టీ గ్రేవ్ కేసుల్లో త్వరితగతిన ఇన్వెస్టిగేషన్ పూర్తి చేసికోర్టులో చార్జిషీట్‌దాఖలు చేయాలన్నారు. ప్రతికేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ ఉండాలన్నారు. అనుమానితుల కదిలికలపై నిరంతరం నిఘా పెట్టాలన్నారు. ప్రతి కేసులో ప్లాన్ ఆఫ్ యాక్షన్ ఉండాలన్నారు. సమావేశంలో డీఎస్పీలు వెంకటరమణ, కరుణాకర్, రమేష్, స్పెషల్ బ్రాంచ్, టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్, ఇన్‌స్పెక్టర్ రమేష్, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.



బదిలీపై వెళ్తున్న సీఐలను సన్మానిస్తున్న ఎస్పీ సురేష్‌కుమార్

బదిలీపై వెళ్లిన సీఐలకు సన్మానం..

ఆసిఫాబాద్ సీఐగా పనిచేస్తూ బదిలీపై మంథనికి వెళ్లిన రాజు, రెబ్బెన సీఐగా పనిచేస్తూ బదిలీపై లక్షెటిపేటకు వెళ్లిన అల్లం నరేందర్‌ను ఎస్పీ సురేష్‌కుమార్ తన కార్యాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యోగంలో బదిలీ అనేది సహజమన్నారు. ఉద్యోగం ఎక్కడ చేసినా క్రమశిక్షణతో బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ అచ్చేశ్వర్, డీఎస్పీలు వెంకటరమణ, కరుణాకర్, రమేష్, సీఐలు, ఆర్ఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

స్వయం ఉపాధిపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ప్రతినిధి శంకర్

ఆసిఫాబాద్‌రూరల్, ఫిబ్రవరి 9: యువకులు పారిశ్రామికవేత్తలుగా ఎదిగి పదిమందికి ఉపాధి కల్పించాలనే సంకల్పంతో ముందడుగు వేయాలని సిర్పూర్ పేపర్‌మిల్లు (ఎస్పీఎం భారతీయ యువశక్తి ట్రస్ట్) ప్రతినిధి శంకర్ సూచించారు. ఆసిఫాబాద్‌లోని ప్రధానమంత్రి కౌశల్ కేంద్రంలో స్వయం ఉపాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందుకు అవసరమైన సహాయ సహకారాలు తమ తరఫున అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఎంకేకే శిక్షణ కేంద్రం నిర్వాహకుడు నితేష్, నరేష్, ట్రస్ట్ ప్రతినిధులు నిఖిల్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ నాయకుల పరామర్శ

చింతలమానేపల్లి, ఫిబ్రవరి 9: మండల బీఎస్పీ ఇన్‌చార్జి, ఎంపీటీసీ తిరుపతి తమ్ముడు నారాయణ శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందగా బాధిత కుటుంబాన్ని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి సిడాం గణపతి పరామర్శించారు. ఆయన వెంట నాయకులు నీలాగౌడ్, సోమాజీ, రాంకుమార్ తదితరులు పాల్గొన్నారు.



కార్మికుడికి మెరుగైన వైద్యం అందించాలి

జైపూర్, ఫిబ్రవరి 9: ఎస్టీపీపీలో గురువారం గాయపడిన కాంట్రాక్టు కార్మికుడు ధీరజ్‌కుమార్ రమేష్‌మేఘన్వార్‌కు మెరుగైన వైద్యం అందించాలని హెచ్ఎంఎస్ నాయకులు ఆర్ విక్రమ్, చిప్పకుర్తి సంపత్ శుక్రవారం ఒకప్రకటనలో డిమాండ్ చేశారు. ఏహెచ్‌పీ డిపార్టుమెంట్‌లో పనిచేస్తున్న ధీరజ్‌కుమార్ రమేష్‌మేఘన్వార్ ప్రమాదశాత్తూ కిందపడడంతో తలకు తీవ్రగాయాలయ్యాయన్నారు. వెంటనే సింగరేణి డిస్పెన్సరీకి తరలించి చికిత్స చేయించామన్నారు. ఇంటికి వెళ్లిన తర్వాత రాత్రి రక్తంతో విరోచనాలు కావడంతో కుటుంబీకులు మంచిర్యాల పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుప త్రిలో చేర్పించారన్నారు. అతని పరిస్థితి విషమంగా ఉందని పవర్‌మేక్ యాజమాన్యం వెంటనే స్పందించి కార్మికుడి వైద్య ఖర్చులు భరించి మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు.

దేశవ్యాప్త సమ్మె పోస్టర్ల ఆవిష్కరణ

రెబ్బెన, ఫిబ్రవరి 9: వివిధ కార్మికసంఘాల ఆధ్వర్యంలో ఈనెల16న చేపట్టే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రీజియన్ అధ్యక్షుడు బోగే ఉపేందర్ తెలిపారు. శుక్రవారం గోలేటీ సీహెచ్‌పీ కార్మికులతో కలిసి సమ్మెపోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా గ్రామీణ భారత్‌బంద్ కార్యక్రమం చేపడుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ గోలేటి బ్రాంచ్ అధ్యక్షుడు స్వామి, కార్యదర్శి లక్ష్మీనారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుపతి పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీతోనే సమస్యల పరిష్కారం

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 9: ఐఎన్‌టీయూసీతోనే సమస్యల పరిష్కారమవుతాయని ఆయూనియన్ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం ఏరియా వర్క్‌షాప్‌లో పర్యటించి కార్మికులసమస్యలు తెలుసుకున్నారు. 250 చదరపు గజాల ఇంటిస్థలం, రూ.20లక్షల వడ్డీలేని రుణం ఇప్పించేందుకు, పెర్క్స్‌పై పన్నుతొలగించేందుకు నూతనబొగ్గుగనులు ఏర్పాటు చేసేందుకు, డిపెండెంట్ల వయస్సు 35నుంచి 40ఏళ్ల వరకు పెంచేందుకు కృషి చేస్తామన్నారు. నియామక పత్రాలు హైదరాబాద్‌లో ఇవ్వడాన్ని తాము ఖండిస్తున్నామని, స్థానికంగానేపత్రాలు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏరియాఉపాధ్యక్షుడు శంకర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

మల్టీ డిపార్ట్‌మెంటల్ సమావేశం

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 9: శ్రీరాంపూర్‌లోని ఆర్కే7గనిపై శుక్రవారం మల్టీడిపార్ట్‌మెంటల్ సమావేశం నిర్వహించగా, ముఖ్యఅతిథిగా ఎస్‌వోటు జీఎం కె రఘుకుమార్ హాజరయ్యారు. ఉత్పత్తి, నాణ్యత పెంచి రక్షణను అనుసరించాలని సూచించారు. ఇందుకు అవసరమైన ప్రణాళి కలు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. ఆర్కె7గని ఉత్పత్తి, రక్షణలో ముందున్నట్లు చెప్పారు. సమావేశంలో ఏఐటీయూసీ బ్రాంచికార్యదర్శి ఎస్‌కె బాజీసైదా, గ్రూప్‌ఏజెంట్ రాముడు, మేనేజర్ సాయిప్రసాద్ పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగులు పదోన్నతులు పొందాలి

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 9: ఇటీవల సంస్థలో మహిళా ఉద్యోగులు అధికసంఖ్యలో చేరుతున్నారని, వారు అన్ని కేటగిరీలలో పదోన్నతులు పొందేందుకు ప్రయత్నించాలని డైరెక్టర్(ప్రాజెక్ట్స్‌ప్లానింగ్) జి వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన ఏరియా జీఎం సంజీవరెడ్డితో కలిసి శ్రీరాంపూర్ ఉపరితలగనిని సందర్శించారు. మహిళాఉద్యోగులతో మాట్లాడారు. సింగరేణిలో నైపుణ్యం చూపిన ఉద్యోగులకు పదోన్నతులు లభిస్తాయని, మహిళా ఉద్యోగులకు డంపర్, షావెల్ ఆపరేటర్లుగా అవకాశాలున్నాయని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం ఓబీ కాంట్రాక్టర్లతో చర్చించారు. ఓబీ వెలికితీత ప్రాముఖ్యతను వారికి వివరించారు. ఉత్పత్తి లక్ష్యాలను సాధించేందుకు ఉద్యోగులు కలిసికట్టుగా కృషి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధికారి పురుషోత్తమరెడ్డి, మేనేజర్ సుధీర్, ఇంజనీర్ చంద్రశేఖర్, సర్వేఅధికారి సంపత్ పాల్గొన్నారు.



ఉద్యోగులతో మాట్లాడుతున్న డైరెక్టర్

రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలి

జైపూర్: కార్మికులు, అధికారులు సమన్వయంతో రక్షణతో కూడినఉత్పత్తిని సాధించాలని డైరెక్టర్ ప్రాజెక్టుఅండ్‌ప్లానింగ్ వెంకటేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం జీఎం సంజీవరెడ్డితో కలిసి ఇందారం ఓసీపీని సందర్శించారు. ఓసీపీలో ఉత్పత్తికి ఓబీ వెలికతీత ప్రాముఖ్యను వివరించారు. ఆయన మాట్లాడుతూ నిర్దేశించిన రోజు వారి ఉత్పత్తిలక్ష్యాన్ని సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో గనిప్రాజెక్టు అధికారిశ్రీనివాస్, గనిమేనేజర్ రవికుమార్, ఆపరేషన్‌మేనేజర్ బ్రహ్మాజీ, ప్రాజెక్టు ఇంజనీర్‌రమేష్ పాల్గొన్నారు.

నాణ్యతతో కూడిన ఉత్పత్తి సాధించాలి

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 9: నాణ్యతతో కూడిన ఉత్పత్తి సాధించాలని శ్రీరాంపూర్ ఏరియా జీఎం బి సంజీవరెడ్డి అన్నారు. ఆర్కే6గనిపై మల్టీడిపార్ట్‌మెంటల్ సమావేశం ఏర్పాటుచేయగా, ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నిర్దేశిత ఉత్పత్తి లక్ష్యం కోసం ప్రతీ ఉద్యోగి తగిన ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రూప్‌ఏజెంట్ ఏవీరెడ్డి, ఏఐటీయూసీ ఉపప్రధానకార్యదర్శి ముస్కెసమ్మయ్య, మేనేజర్ తిరుపతి, రక్షణాధికారి శ్రీనివాస్, సంక్షేమాధికారి సునీల్‌కుమార్, యూనియన్ నాయకులు మోత్కూరికొమురయ్య, సంగం సదానందం, అన్నివిభాగాల అధిపతులు పాల్గొన్నారు.

హామీలు నెరవేరుస్తాం

మందమర్రిటౌన్, ఫిబ్రవరి 9: ఎన్నికల్లో తాము ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని గుర్తింపు సంఘం బ్రాంచ్ సహాయకార్యదర్శి కంది శ్రీనివాస్, పిట్ కార్యదర్శులు గొండ్ల సంపత్ తెలిపారు. శుక్రవారం ఏఐటీయూసీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ కార్మికుల హక్కులే ధ్యేయంగా ముందుకు సాగుతామని తెలిపారు.

ప్రమోషన్ పాలసీ అమలు చేయాలి

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 9: కోల్ ఇండియా మాదిరిగా సింగరేణిలో తమకు సైతం ప్రమోషన్ పాలసీ అమలు చేయాలని ఇంటర్నల్‌అండర్ మేనేజర్లు, సంక్షేమాధికారులు కోరారు. ఈమేరకు వారు శుక్రవారం శ్రీరాంపూర్ ఏరియా అధికారుల సంఘం అధ్యక్షుడు కె వెంకటేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. తమ పదోన్నతులపై కొన్నేళ్లుగా యాజమాన్యానికి విన్నవించుకున్నామని, అయినా ఎలాంటి నిర్ణయం వెలువడలేదన్నారు. ఇప్పటికైనా ఈ-3పాలసీని అమలుచేసేలా సింగరేణి యాజమాన్యంపై ఒత్తిడితేవాలని కోరారు. కార్యక్రమంలో అధికారులు గంట మోహన్‌రెడ్డి, శ్రీనివాస్, వెంకన్న, బాలకృష్ణ, బాలకృష్ణ, పూర్ణచందర్ పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 9: అన్నివిభాగాల అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించాలని ఎస్‌వోటు జీఎం, మల్టీ డిపార్ట్‌మెంటల్ కన్వీనర్ కె రఘుకుమార్ అన్నారు. శుక్రవారం జీఎం కార్యాలయంలో అన్నివిభాగాల ఉద్యోగులు, సిబ్బందితో కలిసి మల్టీడిపార్ట్‌మెంటల్ సమావేశం నిర్వహించారు. సకాలంలో పనులు పూర్తి చేసిసంస్థఅభివృద్ధికి పాటుపడాలన్నారు. పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కె బాజీసైదా, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి, ఏజీఎం(ఫైనాన్స్) మురళీధర్, డీజీఎంలు అరవిందరావు, చిరంజీవులు, రక్షణాధికారి శ్రీధర్‌రావు, ఉద్యోగులు పాల్గొన్నారు.

రెబ్బెన: సింగరేణిలో పనిచేసే ఉద్యోగులు సమయపాలన పాటించాలని జీఎం రవిప్రసాద్ అన్నారు. శుక్రవారం జీఎం కార్యాలయంలో మల్టీడిపార్టుమెంటు కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి సంస్థ పురోగతి సాధించేందుకు ప్రతిఒక్కరు తమవంతు బాధ్యతగా కృషి చేయాలన్నారు. సింగరేణి సంస్థ ఉత్పత్తి, ఉత్పాదకత, రవాణా, ఉద్యోగులు, యంత్రాల పనితీరు తదితర అంశాలతో కూడిన గణాంకాలపై అవగాహణ కల్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జీ ఎస్‌ఓటు జీఎంనాయిని ఉమాకాంత్, ఎజీఎంతిర్మల్‌రావు, డీజీఎం ఉజ్వల్‌కుమార్ బెహెర, ఏరియాసర్వేఅధికారి చంద్రశేఖర్, పర్సనల్ మేనేజర్‌రెడ్డిమల్ల తిరుపతి, అన్నివిభాగాల ఉద్యోగులు పాల్గొన్నారు.